# గిరీశంగారి శిష్యుడి కథ

'శరత్ బాబులా రాయడం కంటె అలా రాయకుండా వుండడం కష్టం' అన్నట్టు "సిగరెట్లు మానెయ్యడం కంటె మానేద్దాం అనుకోకండా వుండడం కష్టం" అనేవాడు శ్రీనివాసరావు. రోజుకి నాలుగు ప్యాకెట్లు కాలుస్తాడు. గొలుసు కాల్పు- అనగా చెయిన్ స్మోకింగ్ అని పేర్కొనవచ్చు.

అతనూ నేనూ వృత్తిరీత్యా లైసెన్సులు పర్మిట్లు తనిఖీ చెయ్యడానికి చాలాచోట్లకి కలిసి వెళతాం. నా స్కూటర్ మీద వెనకాల ఎక్కుతాడు. గోడౌన్ల దగ్గరో, పెట్రోలు అయిపోయినప్పుడు బంకు దగ్గిరో ఆపుతాను. అక్కడా అక్కడా 'నో స్మోకింగ్' అని ఇంగ్లీషులోనూ, 'పొగ త్రాగరాదు' అని తెలుగులోనూ బోర్డులుంటాయి. వాళ్లు ఆ బోర్డులు భద్రతా సూచకంగా పెడతారు. కాని ఇతనేమో ఆ బోర్డు చూడగానే మెలికలు తిరిగిపోయి "సిగరెట్లు మానెయ్యాలోయ్, వెధవది!" అంటాడు. ఆ బోర్డు తనకేదో నీతిపాఠం చెప్పినట్టు. ఆ వేళకి చేతిలో వున్న సిగరెట్టు మాత్రం తప్పకుండా పారేస్తాడు.

ఏదైనా పరాయి వూరికి వెళ్ళవలసి బసెక్కితే, వీలయినంత వెనక సీటు ఎంచుకుని కూర్చుంటాడు. బస్సుల్లో కూడా బోర్డులుంటాయిగా! "పొగత్రాగుట నేరము" అని మరీ, పొగ త్రాగేవాళ్ళని అరెస్టు చెయ్యడానికి పోలీసులు వారంటుతో సహా రెడీగా వున్నంత బెదిరింపుగా రాస్తారు. అందుచేత శ్రీనివాసరావు బస్సెక్కగానే, లేక కండక్టరు కనపడగానే డ్రైవర్ కి లేదా కండక్టరుకి ఓ సిగరెట్ ఆఫర్ చేసేస్తాడు.

సినిమా హాల్లో సిగరెట్ కాల్చడానికి వీల్లేదని (అక్కడ పోలీసులు సిద్ధంగా వుండకపోయినా కాలుస్తున్నది పారేయించడానికి గేట్ బాయ్స్ వుంటారు. మొండి ఘటాల్ని టాకిల్ చెయ్యడానికి మేనేజరు, అతని బల్లమీద టెలిఫోను-) సినిమాలు బాగా తగ్గించేశాడు శ్రీనివాసరావు. "డబ్బూ టైమూ రెండు దండగలు, మూడు గంటలు సిగరెట్లు కాల్చకుండా వున్నందుకు మూడు రూపాయలు ఖర్చు. అదే సినిమాకి వెళ్ళకపోతే రెండు రూపాయల సిగరెట్లతో ఆరు గంటలు గడపొచ్చు." అంటాడు.

అతన్ని ఏడిపించడానికి, "సిగరెట్లతో మేడ కట్టడం" లాంటి జోక్ వ్యాసాలు చూపిస్తూ వుంటాను. (అదే రోజుకి నాలుగు పాకెట్లు అంటే ఎనిమిది రూపాయలు, నెలకి 240, ఏడాదికి 2,880, ముప్ఫయ్యేళ్ళలో ఎనభై అయిదు వేల విలువచేసే మేడ-) అతనూ ఆ జోక్‌లో లాగే "మాకు మేడ వుందిగా, మళ్ళా ఎందుకు కట్టడం? పైగా ఇప్పుడు ధర (నేల)ధర బాగా పెరిగింది. దానికి తోడు సిమెంటు, రాయి, ఇసక, కఱ్ఱ, ఇనుము అన్నిటికీ పర్మిట్ల ధరలు పెరిగాయి. ప్లాన్ అప్రూవ్ చేయించడానికి లంచాల రేట్లు పెరిగాయి. అంచేత నేను మేడ కట్టనుగాక కట్టను!" అంటాడు.

అలాంటి శ్రీనివాసరావు, మరి ఎవరిమాట విన్నాడో ఓరోజు ఉదయం నుంచి సిగరెట్ కాల్చడం మానేశాడట, ఆ సాయంకాలం తెలిసింది. 'సిగరెట్ మానేయడం చాలా తేలిక. మార్క్-ట్వెయిన్ అనే ఆయన వెయ్యిసార్లు మానేశాట్ట' అన్నాను. 'షటప్' అని కలియబడ్డాడు నా మీద. 'అయామ్ సీరియస్, నో!' అన్నాడు తీవ్రంగా.

ఆఫీసు పనిమీద పదిహేను రోజులు హైదరాబాదు క్యాంపు పడితే వెళ్ళాను. తిరిగొచ్చిన రోజున శ్రీనివాసరావు సీరియస్‌గా పని చేసుకుంటూ కనబడ్డాడు. 'హవార్యూ' అన్నాను. 'ఫైన్' అన్నాడు. 'సిగరెట్సు మానేసి నట్టున్నావే.' అన్నాను. 'ఏమనుకున్నావ్ మరి! ఇవాల్టికి పదిహేడు రోజులైంది. గ్రాండ్ సక్సెస్.'

ఆ సాయంకాలం శ్రీనివాసరావు కొడుకు మార్కెట్లో కనిపించాడు. "మా నాన్నగారు కలిశారండీ?" అన్నాడు.

"ఆఁ సిగరెట్లు మానేశాడుగా, సంతోషంగా వుంది."

'ఈ ఆదివారమైనా ఇంటికి రమ్మనండి సార్! మా అమ్మ బెంగెట్టుకుంది' అన్నాడు. షా కయ్యాను. తరువాత అతను చెప్పిన సంగతేమిటంటే; ఇంట్లో వున్నప్పుడు సిగరెట్టు కాల్చబుద్ధవుతుందని, వాళ్ళ గురువుగారైన సోమనాధశాస్త్రి గారింట్లోనే వుండిపోతున్నాట్ట! రాత్రి పగలూనూ, ఇలా ఇరవై రోజులైందట.

మళ్ళా యాభై రోజులపాటు నేను గుంటూరులో ఒక ట్రయినింగ్ క్లాస్ నిర్వహించడానికి వెళ్ళాను. తిరిగొచ్చాక శ్రీనివాసరావు సస్పెన్

షన్‌లో వున్నాడని తెలిసింది. మా జోనల్ ఆఫీసర్‌గారు మంచివారు ఆయన్ని సంగతేమిటో అడుగుదామని, అందులోంచి బైటపడే వుపాయం ఆయనే చెప్పగలరని వెళ్ళాను.

"తెలివిగలవాడే, ఎప్పుడూ తప్పు నిర్ణయం తీసుకోడు. ఈమధ్య చాలా మందకొడిగా తయారయ్యాడు. ఆ వేర్‌హౌసింగ్ వాళ్ళ టాక్స్ అసెస్మెంట్ ఇతనికి వొప్పచెప్పాంగా! స్టేట్‌మెంటు చూశాం, వాళ్ళ అసెట్స్‌కి ఇతని అసెస్మెంటువల్ల రెండు లక్షలు నష్టం వస్తోందని తేలింది. వాళ్ళని ఎన్‌క్వైర్ చేశాను. ఏదైనా అవినీతి మార్గం పట్టాడా, సూచించాడా అని, చాలా ఫెయిర్‌గా చెప్పారు వాళ్లు. అతనికి ఏదో అసంతృప్తి, అన్యాయభావం పట్టుకుంది. అది తొలిగిపోతే మళ్ళీ మామూలు మనిషి అవుతాడని నా నమ్మకం" అన్నారాయన.

దార్లో ఒక సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె కొన్నాను. తిన్నగా సోమనాథశాస్త్రి గారింటికి స్కూటర్ పోనిచ్చాను.

వరండాలో శాస్త్రిగారబ్బాయి, అమ్మాయి, అల్లుడు, శ్రీనివాసరావు కేరమ్స్ ఆడుతున్నారు. శాస్త్రిగారు పేపర్ చదువుతున్నారు.

"అంతా బావున్నారా?" అని పలకరించి సిగరెట్ ప్యాకెట్ తెరిచాను. శాస్త్రిగారబ్బాయి తండ్రిగారివైపు; శాస్త్రిగారల్లుడు పెళ్ళాం వేపు భయం భయంగా, దీనంగా చూసి చెరొకటీ తీసుకున్నారు. శ్రీనివాసరావు విశ్వామిత్రుడి ఫోజు పెట్టాడు. ఇంతలో లోపల్నుంచి శాస్త్రిగారి ఇల్లాలొచ్చి నాకు మంచి నీళ్ళందిస్తూ చేతిలో సిగరెట్ ప్యాకెట్ తీసుకుని "పోదురూ బడాయి,ఎప్పుడూ కాల్చనట్టు" అని ఆయనకిచ్చింది.

శ్రీనివాసరావు నా చేతిలో నీళ్ళ గ్లాసందుకుని గటగటా తాగేశాడు. ఇప్పుడు శ్రీనివాసరావు రోజూ తన ఇంటికే వెడుతున్నాడు. అతనిమీద సస్పెన్షన్ వెకేట్ అయింది. మంచి బ్రిలియంట్‌గా ఉద్యోగం చేసుకుంటున్నాడు- "మన అలవాట్లే మనల్ని పోషిస్తాయి." అంటాడతను.

(3-11-79)

(సిగరెట్లు మానేసికూడా బ్రిలియంట్‌గా వున్న వాళ్ళకి క్షమాపణలతో)

(24)